మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా భైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏక్రాలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యనారాయణ, సుగుణ, వెంకటేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

• మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

• తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. – నేరేడుచర్ల

• గుండూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ధర్నా

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు – కల్వకుర్తి రూరల్

సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు.

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి/పోచమ్మమైదాన్, అక్టోబర్ 1: హైడ్రా పేరు తో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో, వరంగల్‌లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణిగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

చంద్రశేఖర్

నరేశ్‌రెడ్డి

మాచారానికి చెందిన చంద్రశేఖర్..

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లాస్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

గిర్మాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

బీఆర్ఎస్ గోవిందాపూర్ గ్రామ కమిటీ ఎన్నిక

శ్రావణ్‌కుమార్

శాయంపేట, అక్టోబర్ 1: మండలంలోని గోవిందాపూర్ బీఆర్ఎస్ గ్రామ కమిటీని మంగళవారం మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా దాసి శ్రావణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నర్రా రాజు, ఉపాధ్యక్షులుగా బొత్స మహేందర్, బైరి రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా రాజేశ్వర్‌రావు, ప్రచార కార్యదర్శిగా కల్వల సతీశ్, సభ్యులను ఎన్నుకున్నారు. మాజీ ఎంఎంసీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, మాజీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రవీందర్, మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, అరికిల్ల ప్రసాద్, కొమ్ముల శివ, విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్, కరణ్‌బాబు ఉన్నారు.

వీధి లైట్లను రిపేర్ చేయాలి

పరకాల, అక్టోబర్ 1: పట్టణంలో వీధిలైట్లను మరమతు చేయాలని కోరుతూ సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి బొచ్చు కల్యాణ్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ నర్సింహకు వినతిపత్రం అందించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లపై వీధిలైట్లు వెలగక చీకట్లు కమ్ముకున్నాయని తెలిపారు. వెంటనే వీధిలైట్ల మరమతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు మడికొండ ప్రశాంత్, హేమంత్, ఈశ్వర్, సాయితేజ, శివ, అరవింద్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఆత్మకూరు, అక్టోబర్1: ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు వి.మౌనిక, టీ.మనోజ్‌కుమార్ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ గైసమ్మ మంగళవారం తెలిపారు. ఈనెల 3వ, తేదీ నుంచి 5వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుల్లా నిర్మలకుమారి, ఉపాధ్యాయులు అభినందించారుఅభినందించారు.

వయోవృద్ధులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పరకాల, అక్టోబర్ 1: వయోవృద్ధులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆర్డీవో కే నారాయణ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో హాజరై మాట్లాడారు. వయోవృద్ధుల కోసం తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టం 2007లో వచ్చిందని తెలిపారు. రేపాల నర్సింహారాములు, భూషి ప్రభాకర్‌రెడ్డి, సమ్మయ్య, సిరికొండ శ్రీనివాసాచారి, పోరండ్ల కైలాసం, సంపత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజు వ్యాఖ్యలపై బీజేపీ నిరసన

రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు

ఐనవోలు, అక్టోబర్ 1: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడడంపై తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీశ్ తెలిపారు. కేజీబీవీలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ మండల అధ్యక్షుడు అడ్డగట్ల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నాగరాజు దిష్టిబొమ్మ దహనాన్ని ఎస్సై పీ శ్రీనివాస్ అడ్డుకున్నారు. దీంతో మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ న్యాయస్థానంలోనే జడ్జిలు భగవద్గీతపై ప్రమాణం చేసి తీర్పునిస్తున్నారని, అలాంటి హిందువుల దేవాలయాలు నిర్మిస్తే భిక్షగాళ్లు తయారవుతారంటూ చేసిన వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, తిరుపతి, మాజీ సర్పంచ్ రాజు, జిల్లా కార్యదర్శి మహేశ్వర్‌గౌడ్, వెంకటనారాయణ, కుమారస్వామి, ప్రభాకర్, రాంరెడ్డి, రాజు, మహేశ్ పాల్గొన్నారు.

బొడ్డెమ్మ వేడుకల ముగింపు

ఆత్మకూరు, అక్టోబర్ 1: బొడ్డెమ్మ వేడుకలు మంగళవారం ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు మహిళలు, బాలికలు బొడ్డెమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పుట్టమట్టితో బొడ్డెమ్మను చేసి రోజూ సాయంత్రం ఆడి పాడారు. చివరి రోజున చెరువుల్లో నిమజ్జనం చేశారు.

బొడ్డెమ్మ వేడుకల్లో మహిళలు, బాలికలు

ట్రాలీ ఆటోలో మంటలు

శాయంపేట, అక్టోబర్ 1: హైవేపై షార్ట్ సర్క్యూట్‌తో ట్రాలీ ఆటోలో మంటలు లేచి దగ్ధమైన ఘటన మండలంలోని మాందారిపేట శివారులో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ నుంచి ట్రాలీలో టైర్లను పరకాలకు తీసుకెళ్లి అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా మాందారిపేట మూలమలుపులోని కేజీబీవీ సమీపంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ సతీశ్ వాహనాన్ని రోడ్డు పక్కకు ఆపేశాడు. వాహనంలోని హమాలీ ప్రశాంత్ 100కు డయల్ చేయగా ఎస్సై ప్రమోద్‌కుమార్ పరకాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైరింజిన్ చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. క్యాబిన్ లోపలి భాగం కాలిపోయింది. డ్రైవర్, హమాలీ ప్రాణాలతో బయటపడ్డారు.

రేపటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం హైదరాబాద్ వారు నిర్వహిస్తున్న ఓపెన్, పదో తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు 3 నుంచి 9 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి, ప్రభుత్వ పరీక్షల సహాయ నిర్వహణాధికారి బి.భువనేశ్వరి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్స్‌ను ప్రవేశం పొందిన స్టడీ సెంటర్‌లో లేదా www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో తీసుకోవాలన్నారు. వారికి జిల్లా కేంద్రాల్లో కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో గంట ముందుగా హాజరుకావాలన్నారు. ఆధార్‌కార్డు లేదా మరేదైనా ప్రభుత్వ గుర్తింపుకార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని, వరంగల్ ఉమ్మడి జిల్లాలో పదో తరగతికి 601, ఇంటర్‌లో 663 మంది పరీక్ష రాయనున్నట్లు, ఇతర వివరాలకు 80084 03631 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దసరా పండుగకు 850 స్పెషల్ బస్సులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: దసరా పండుగకు ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో వరంగల్ రీజియన్ పరిధిలో ఈనెల 12 వరకు 850 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. మహాలక్ష్మి పథకం దృష్ట్యా ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు. హనుమకొండ 125, జనగామ 120, వరంగల్–1 నుంచి 125, వరంగల్–2 నుంచి 125 మహబూబాబాద్ 47, నర్సంపేట 119, పరకాల 93, తొర్రూరు 48, భూపాలపల్లి 48 ప్రత్యేక బస్సులు, ఉప్పల్ నుంచి హనుమకొండకు కూడా నడపనున్నట్లు వివరించారు.

ప్రభుత్వ ఆఫీసుల్లో టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి

హనుమకొండ, అక్టోబర్ 1: జిల్లాలోని అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో టాయిలెట్స్ నిర్మించాలని వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకుడు సిరాజుద్దీన్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆ సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ సురేష్‌లాల్, సభ్యులతో కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. సంస్థ సభ్యులు నిమ్మల శ్రీనివాస్, కాజీపేట పురుషోత్తం, శనిగరం రాజమోహన్, బిట్టవరం శ్రీమన్నారాయణ, ఇందారపు నాగేశ్వర్‌రావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో బదిలీల సందడి

- రెండేళ్లు పూర్తయిన వారికి బదిలీ
- జాబితా సిద్ధం చేసిన అధికారులు

హనుమకొండ, అక్టోబర్ 1: విద్యుత్ శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నేపథ్యంలో ఆయా కార్యాలయాల్లో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. సీఎండీ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు టీజీ ఎన్‌పీడీసీఎల్ పరిధిలో 16 జిల్లాల్లో బదిలీ ప్రక్రియకు ఇన్‌చార్జి ఆపరేషన్ డైరెక్టర్ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. 103 మంది డీఈలు క్యాడర్ స్ట్రెంత్ ఉంటే 17 మందిని (50శాతం మించకుండా) బదిలీ చేయనున్నారు. ఏడీ క్యాటగిరిలో 240 మంది ఉంటే 115 మందికి, సివిల్ ఏడీ క్యాటగిరిలో 8 మంది ఉంటే నలుగురు, 783 ఏఈలు ఉండగా 386 మందికి బదిలీ కానుంది. అకౌంట్స్ విభాగంలో ఎస్ఏవో, ఏఏవో, ఏవోలు కలిపి మొత్తం 139 మంది క్యాడర్ స్ట్రెంత్ ఉండగా వీరిలో 68 మంది, జేఏవోలు 17 మంది ఉంటే 8 మందికి, పీఎన్‌జీ సర్వీస్‌లో అసిస్టెంట్ సెక్రటరీల నుంచి అసిస్టెంట్ల వరకు మొత్తం 58 మంది క్యాడర్ స్ట్రెంత్ ఉంటే 27 మందికి, సబ్ ఇంజినీర్ల విభాగంలో క్యాడర్ స్ట్రెంత్ ఆరుగురు ఉంటే వీరిలో ముగ్గురికి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు కలిసి క్యాడర్ స్ట్రెంత్ నలుగురు ఉంటే వీరిలో ముగ్గురికి బదిలీ చేయనున్నారు.

హనుమకొండ జిల్లా పరిధిలో..

హనుమకొండ జిల్లాలో సర్కిల్, పట్టణ డీఈ, గ్రామీణ డీఈ పరిధిలో బదిలీలు కానున్నాయి. హనుమకొండ సర్కిల్ పరిధిలో ఎస్ఈ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. అన్ని కేటగిరీల్లో కలిసి క్యాడర్ స్ట్రెంత్ 265 మంది ఉండగా 137 మందిని బదిలీ చేయనున్నారు. ఏడీఈలు క్యాడర్ స్ట్రెంత్ 19 మంది ఉంటే ఆరుగురు, ఏఈఈ ఒక్కరు ఉండగా ఒక్కరికి, ఏఈలు 49 మందిలో 29, సబ్ ఇంజినీర్లు 39 మందికి 20, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ 22 మందికి 11, సీనియర్ అసిస్టెంట్లు 37 మందికి 19, జూనియర్ అసిస్టెంట్లు 41 మందికి 21, రికార్డు అసిస్టెంట్ ఒక్కరు ఉండగా ఒక్కరి బదిలీ కానుంది. ఆఫీస్ సబార్డినేట్స్ 34 మంది ఉండగా 17, ఫోర్మెన్లు 9 మంది ఉండగా ఐదుగురు, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు 13 మందికి ఏడుగురికి బదిలీకానుంది. హనుమకొండ టౌన్ పరిధిలో ఆపరేషన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లైన్ ఇన్‌స్పెక్టర్లు 22 మందికి 11, లైన్‌మెన్స్ 44 మంది ఉండగా 22కు బదిలీ చేయనున్నామని, జేఎల్ఎం, ఏఎల్ఎంలు ఇటీవల పదోన్నతులు రావడంతో వారికి జీరో బదిలీ అని తెలిపారు. హనుమకొండ గ్రామీణ పరిధిలో డీఈ సొమ్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. లైన్‌మెన్స్ క్యాడర్ స్ట్రెంత్ 88 మందికిగాను 44, లైన్ ఇన్‌స్పెక్టర్స్ 28 మందికిగాను 14, ఒక జేఎల్ఎం, ఇద్దరు ఏఎల్ఎంలకు బదిలీలు కానున్నాయి.

రేపటి నుంచి భద్రకాళీ శరన్నవరాత్రులు

వరంగల్, అక్టోబర్ 1 : ప్రసిద్ధ భద్రకాళీ ఆలయంలో ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన అర్చకుడు భద్రకాళీ శేషు వివరాలు తెలిపారు. అమ్మవారికి తొమ్మిది రోజులపాటు రోజుకో అలంకరణ ఉంటుందని, తొలిరోజు బాలత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. 12వ తేదీ విజయదశమి రోజు సాయంత్రం విద్యుద్దీపాలతో అలంకరించిన హంసవాహనంపై ఇక్కడి చెరువులో అమ్మవారి ఊరేగిస్తూ తెప్పోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆలయ ఈవో శేషుభారతి మాట్లాడుతూ భద్రకాళీ శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ హరినాథ్, శ్యామ్, అర్చకులు రాము శర్మ పాల్గొన్నారు. కాగా, తొమ్మిది రోజులపాటు వైభవంగా జరిగే భద్రకాళీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి సీఎం కేసీఆర్ బహూకరించిన బంగారు కిరీటం, ఇతర బంగారు ఆభరణాలను అలంకరించనున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు భద్రకాళీ ఆలయ ఆర్చి గేట్ నుంచి వేదపండితులు మంత్రోచ్చారణలు, కళాకారుల కోలాటాల నడుమ బంగారు ఆభరణాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి అలంకరిస్తారు. కాగా, భద్రకాళీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆహ్వానిం చారు. మంగళవారం ఆలయ ఈవో శేషుభారతి, ఆలయ ప్రధాన అర్చకుడు శేషు కలిసి ఆహ్వాన పత్రిక, అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ హరినాథ్ ఉన్నారు.

మంత్రి సురేఖను ఆహ్వానిస్తున్న ఈవో శేషుభారతి, అర్చకుడు శేషు

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ, అక్టోబర్ 2: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గంలోని ఐనవోలు మండలం వెంకటాపూర్, గర్మిళ్లపల్లికి చెందిన ఐదుగురు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.5లక్షల 580 విలువైన చెక్కులు, ఇద్దరు లబ్ధిదారులకు రూ.27వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా వినయ్‌కృష్ణారెడ్డి

హనుమకొండ, అక్టోబర్ 1: రాష్ట్రంలో పది ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులు నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా హెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యూ శాఖ జాయింట్ సెక్రటరీ టి.వినయ్ కృష్ణారెడ్డిని నియమించారు.

ప్రజలకు మేయర్ బతుకమ్మ శుభాకాంక్షలు

వరంగల్, అక్టోబర్ 1: నగర ప్రజలకు మేయర్ గుండు సుధారాణి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలను శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ బుధవారం ఎంగిలిపూలతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తుందని, ఆడబిడ్డలు సంతోషంగా జరుపుకోవాలని ఓ ప్రకటనలో ఆకాంక్షించారు.

అన్నదాతల నడ్డి విరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

వేలేరు, అక్టోబర్ 1: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతుభరోసా డబ్బులు వెంటనే అందించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి మారబోయిన రాజు రైతులతో కలిసి డిమాండ్ చేశారు. పీచర గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఎకరానికి రూ.15వేలు రైతుభరోసా అందిస్తామని ప్రకటించి, ఇప్పుడు ఆ హామీని పక్కన పెట్టేసిందన్నారు. వానాకాలం పంట కోత దశకు చేరుకున్నప్పటికీ ఇవ్వడంలేదన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భద్రయ్య

పరకాల, అక్టోబర్ 1: పరకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పెంబెల భద్రయ్య కొనసాగనున్నట్లు అసోసియేషన్ ఎన్నికల అధికారి ఒంటేరు రాజమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సివిల్ కోర్టు ఆవరణలో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ ఎన్నికల నియమావళి ప్రకారం అక్టోబర్ 1 నుంచి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతారని తెలిపారు.

'కిట్స్'లో సంశోధిని-24 పోస్టర్ ఆవిష్కరణ

హసన్‌పర్తి, అక్టోబర్ 1: కిట్స్‌లో జాతీయస్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం సంశోధిని–24 పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ కిట్స్‌లో ఈనెల 18, 19 తేదీల్లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంశోధిని థీమ్ సరిహద్దులు దాటిన ఆవిష్కరణ అని పేర్కొన్నారు. ప్రోగ్రాం కన్వీనర్ నరసింహారావు, మధుకర్‌రెడ్డి, పీఆర్‌వో ప్రభాకరాచారి పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, అక్టోబర్ 1: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం దర్గా కాజీపేటలో జరిగింది. కాజీపేట ఎస్సై లవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దర్గా కాజీపేట అంబేద్కర్ నగర్‌కు చెందిన నేలికంటి రాకేశ్(35) కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో రాకేశ్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మెట్టుగుట్ట నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

మడికొండ, అక్టోబర్ 1: మడికొండలోని మెట్టుగుట్ట ఆలయ నిధులను ఈవో శేషుభారతి దుర్వినియోగానికి పాల్పడుతున్నారని గ్రామానికి చెందిన పల్లపు అశోక్ హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. గుట్టపైకి వెళ్లేందుకు ఘాట్ రోడ్డుకు నిర్మించిన సైడ్‌వాల్ ఇటీవల వర్షాలకు పూర్తిగా కూలిపోయిందని పేర్కొన్నారు. రామాలయం నిధి నుంచి సుమారు రూ.18లక్షలు అంచనా వ్యయంతో టెండర్ లేకుండా నామినేటెడ్ పద్ధతిలో ఓ వ్యక్తికి నిర్మాణ పనులు అప్పగించారని తెలిపారు. నాసిరకంగా పనులు చేయడంతో ఆరు నెలలకే కూలిందని, క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు లేకుండానే సదరు కాంట్రాక్టర్‌కు రూ.12లక్షలు చెల్లించినట్లు వివరించారు. సదరు ఈవోను సస్పెండ్ చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.